
ANN తెలుగు

# మహా పత్రిక

07

బుధవారం, హైదరాబాద్ | 12-11-2025 | వ్యాపార వార్తలు | BUSINESS NEWS | WWW.MAHAADAILY.COM



# ఉద్యోగంతో ఊడిగం చేయాల్సిందేనా..!



### వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌పై ప్రముఖుల వైఖరి

టెస్లా, స్పేస్‌ఎక్స్‌కు సారథ్యం వహిస్తూ వాటిని విజయపథంలో నడిపించేందుకు వారానికి 120 గంటలు, రోజుకు సుమారు 17 గంటలు పనిచేశానని ఎలాన్ మస్క్ ఇటీవల ఒక సందర్భంలో తెలిపారు. చాలాసార్లు రాత్రిళ్లు కూడా పని చేసేవాడినని చెప్పారు. ప్రొడక్షన్‌ను పర్యవేక్షించడానికి ఫ్యాక్టరీలోనే నిద్రపోయిన సంఘటనలున్నాయని తెలిపారు. మస్క్ 2022లో ఎక్స్‌ను కొనుగోలు చేసినప్పుడు ఉద్యోగులకు 'పని చేయడానికి జీవితాలను అంకితం చేయాలి లేదా సంస్థలో పని చేయడం మానేయాలి' అని తన వైఖరిని స్పష్టం చేశారు. ఇటీవల ఇన్ఫోసిస్ ఛైర్మన్ నారాయణమూర్తి ఇదే తరహా వ్యాఖ్యలు చేసి వైరల్‌గా నిలిచారు. ఈనేపథ్యంలో జీవితంలో విజయం సాధించిన వారు వర్క్‌లైఫ్ సమతుల్యతను వదులుకున్న వారేనా అనే ప్రశ్న తలెత్తుతోంది.

### విజయానికి త్యాగం తప్పనిసరి..

ప్రముఖ పారిశ్రామికవేత్త, బిలియనీర్ మార్క్ క్యూబన్ వ్యాఖ్యలు ఇటీవల వివాదాస్పదమయ్యాయి. అయితే, తనకు నిజాయితీ కలిగిన వ్యక్తిగా పేరుంది. ది ప్లేబుక్ సిరీస్‌లో ఆయన వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ కాన్సెప్ట్ ఉండదని చెప్పారు. ఆయన అభిప్రాయం ప్రకారం, సాధారణంగా 9-5 ఉద్యోగం చేస్తున్నవారు కొంత సమతుల్యతను పొందగలరేమో కానీ అత్యుత్తమ స్థానాన్ని కోరుకునే వారికి అది అసాధ్యమన్నారు. విజయానికి త్యాగం తప్పనిసరని చెప్పారు.

### సమతుల్యత కంటే సమన్వయం ముఖ్యం

అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ మాత్రం వర్క్ లైఫ్ సమతుల్యతకు ఆమోదం తెలిపారు. 'నేను ఇంట్లో సంతోషంగా ఉంటేనే నా పనిలో ఉత్తమంగా ఉంటాను. పని, వ్యక్తిగత జీవితం మధ్య పోటీ కాకుండా పరస్పర సహకారం అవసరం. సమతుల్యత కంటే సమన్వయం కీలకంగా ఉంటుంది' అన్నారు. మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల కూడా ఈ ఆలోచనకు అనుకూలంగా ఉన్నారు. 'వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ కంటే రెండింటి మధ్య సమన్వయం చాలా ముఖ్యం. అంటే మన ఆసక్తులు, విలువలను వృత్తిలోనూ ఉండేలా జాగ్రత్తపడితే మెరుగైన ఫలితాలు ఉంటాయి' అన్నారు.

### 9-9-6 రూల్..

చైనాలోని అలీబాబా సహ వ్యవస్థాపకుడు జాక్ మా '996' పని సంస్కృతిని సమర్థించారు. అంటే ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు, వారానికి 6 రోజులు పని చేయాలి. యువత వృత్తిపరంగా ఎదగాలంటే దీన్ని అనుసరించాలని చెబుతున్నారు. అయితే 'మీకు ఇష్టమైన పని దొరికితే 996 పని సమస్య కాదు' అని అన్నారు.

# బంగారం మాయలో పడొద్దు!

పెళ్లిళ్ల సీజన్ కావడంతో ప్రస్తుతం చాలా కుటుంబాల్లో బంగారంపై చర్చ జరుగుతుంది. పెళ్లి కుటుంబాల్లో బంగారం కొనుగోలు అనివార్యం. అయితే పసిడిపై పెట్టుబడి పెట్టాలనుకునేవారు కూడా ఇదే అదనుగా పుత్తడిని కొనుగోలు చేస్తుంటారు. అంతర్జాతీయ అనిశ్చితులు, ద్రవ్యోల్బణం భయాల మధ్య బంగారం ధరలు ఇటీవల ఆకాశాన్ని తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో తమ సంపదను కాపాడుకోవడానికి, ద్రవ్యోల్బణాన్ని అధిగమించడానికి చాలా మంది పెట్టుబడిదారులు బంగారంపై దృష్టిసారిస్తున్నారు. అయితే బంగారంలో పెట్టుబడి అంటే నేరుగా ఆభరణాలు లేదా కాయిన్స్ కొనుగోలు చేయాలని కొందరు భావిస్తున్నారు. కానీ, కేవలం 'బంగారం' అనే భావనతో భౌతిక రూపంలో పెట్టుబడి పెట్టడం వల్ల ఊహించని నష్టాలు, ఇబ్బందులు ఎదురవుతాయని గుర్తుంచుకోవాలి. మరి.. ఈ మెరిసే లోహంలో సురక్షితంగా, లాభదాయకంగా పెట్టుబడి పెట్టాలంటే సరైన మార్గం ఏమిటో తెలుసుకుందాం.

**భౌతిక బంగారం కొనుగోలుతో..**

బంగారం కొనుగోలు అనేది తరతరాలుగా వస్తున్న ఒక అలవాటు. అయితే, దీన్ని ఒక పెట్టుబడి సాధనంగా చూసినప్పుడు నేరుగా బంగారం కొనుగోలు చేయడం (ఫిజికల్ గోల్డ్) అనేక ప్రతికూలతలను కలిగి ఉంటుంది. ఆభరణాలు కొన్నప్పుడు బంగారం అసలు ధరతో పాటు అధికంగా 8% నుంచి 30% వరకు తయారీ ఛార్జీలు, తరుగు రూపంలో కొంత చెల్లించాల్సి వస్తుంది. ఈ ఖర్చు పెట్టుబడుల నుంచి లాభాన్ని తగ్గిస్తుంది. బంగారాన్ని కొనుగోలు చేసేటప్పుడు దాని స్వచ్ఛత (క్యారెట్) విషయంలో అనుమానాలు, మోసాలు జరిగే అవకాశం ఉంది. హాల్‌మార్క్ ఉన్నప్పటికీ చిన్న దుకాణాల్లో నాణ్యతను తనిఖీ చేయడం కష్టం. భౌతిక బంగారాన్ని ఇంట్లో ఉంచుకుంటే దొంగతనం జరిగే ప్రమాదం ఉంది. బ్యాంక్ లాకర్లలో ఉంచినా అద్దె, ఇతర ఛార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఇది పెట్టుబడిపై రాబడిని తగ్గిస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో బంగారాన్ని త్వరగా సరైన ధరకు అమ్మడం కష్టం కావచ్చు. కొన్నిసార్లు కొనుగోలు చేసిన ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సి వస్తుంది. కొనుగోలు చేసేటప్పుడు జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. ఇది పెట్టుబడిదారునికి అదనపు భారం. బంగారు ఆభరణాలు ఖర్చు లేదా అలంకారం కిందకు వస్తాయి తప్ప పూర్తిస్థాయి పెట్టుబడి కిందకు రావని గమనించాలి.

**గోల్డ్ ఈటీఎఫ్‌లు**

బంగారంపై పెట్టుబడి పెట్టాలనుకునే వారికి భౌతిక బంగారానికి ప్రత్యామ్నాయంగా సులభంగా, పారదర్శకంగా ఉండే మార్గాలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (Gold ETFs). గోల్డ్ ఈటీఎఫ్‌లు అంటే ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న గోల్డ్ యూనిట్లు అని అర్థం. ఇవి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (BSE) లేదా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (NSE)లో షేర్ల వలె ట్రేడ్ అవుతాయి. ఒక గోల్డ్ ఈటీఎఫ్ యూనిట్ సాధారణంగా ఒక గ్రాము బంగారానికి సమానం.



**గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో ఎలా ఇన్వెస్ట్ చేయాలి?**

ముందుగా ఏదైనా బ్రోకరేజ్ సంస్థ వద్ద డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాను తెరవాలి. ఇది షేర్లు కొనుగోలు చేయడానికి అవసరం. వివిధ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (AMC) అందించే గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో (ఉదా: నిప్పన్ ఇండియా గోల్డ్ ఈటీఎఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ గోల్డ్ ఈటీఎఫ్..) ఒకదాన్ని ఎంచుకోవాలి. ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లో మీకు కావలసిన గోల్డ్ ఈటీఎఫ్ పేరును ఎంటర్ చేసి షేర్లను కొనుగోలు చేసినట్లే యూనిట్లను కొనుగోలు చేయవచ్చు. ఒకేసారి పెద్ద మొత్తంలో లేదా క్రమంగా చిన్న మొత్తాల్లో (సిప్ మాదిరిగా) కొనుగోలు చేయవచ్చు.

**గోల్డ్ ఈటీఎఫ్‌ల వల్ల ప్రయోజనాలు**


గోల్డ్ ఈటీఎఫ్‌లు అనేక రకాల ప్రయోజనాలను అందించి, భౌతిక బంగారంపై మెరుగైన పెట్టుబడి సాధనంగా నిలుస్తాయి. ప్రతి ఈటీఎఫ్ యూనిట్ 99.5% స్వచ్ఛత కలిగిన భౌతిక బంగారం కలిగి ఉంటుంది. నాణ్యత గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇందులో తయారీ ఛార్జీలు, తరుగు వంటివి ఉండవు. కేవలం కొద్దిపాటి బ్రోకరేజ్, ఫండ్ నిర్వహణ ఛార్జీలు (సాధారణంగా 0.5% లోపు) మాత్రమే ఉంటాయి. ఇది లాభాలను పెంచుతుంది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో రోజులో ఎప్పుడైనా అమ్ముకోవచ్చు, కొనుగోలు చేయవచ్చు. తక్షణమే నగదుగా మార్చుకోవచ్చు. ఈటీఎఫ్‌లు ఎలక్ట్రానిక్ రూపంలో డీమ్యాట్ ఖాతాలో నిల్వ చేయబడతాయి కాబట్టి, దొంగతనం అయ్యే ప్రమాదం లేదు. లాకర్ ఖర్చులు ఉండవు. కేవలం ఒక యూనిట్ (సుమారు ఒక గ్రాము బంగారానికి సమానం) నుంచే పెట్టుబడి ప్రారంభించవచ్చు. దీనివల్ల సాధారణ మధ్యతరగతి పెట్టుబడిదారులు కూడా సులభంగా ఇన్వెస్ట్ చేయవచ్చు.



## ఎయిర్ పొల్యూషన్ ఎఫెక్ట్.. అమల్లోకి కొత్త రూల్!


ఢిల్లీలో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది. దీనిని దృష్టిలో ఉంచుకుని.. తీవ్రతరం అవుతున్న వాయు కాలుష్య స్థాయిలను అరికట్టడానికి గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (GRAP) దశ IIIని అమలు చేయాలని కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (CAQM) ఆదేశాలు జారీ చేసింది. కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (CAQM) ఆదేశాల ప్రకారం.. ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్‌లలో అన్ని BSIII పెట్రోల్ మరియు BSIV డీజిల్ వాహనాలను డ్రైవ్ చేయకూడదు. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో AQI లెవెల్ 400 మార్కును దాటడంతో అక్కడి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే రూ. 20వేలు వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

2020 ఏప్రిల్ నెలకు ముందు అమ్ముడైన అన్ని కార్లు BSIV కేటగిరీలోకి వస్తాయి. కాగా BSIII నిబంధనలు 2010 ఏప్రిల్ నుంచి అమలులోకి వచ్చాయి. ప్రస్తుతం దేశంలో బీఎస్6 వాహనాలు వినియోగంలో ఉన్నాయి. ఈ వాహనాలతో పోలిస్తే.. బీఎస్4, బీఎస్3 వాహనాలు అధిక కాలుష్య కారకాలను విడుదల చేస్తాయి. ఈ కారణంగానే ఢిల్లీలో ఈ వాహనాల వినియోగాన్ని తాత్కాలికంగా నిషేధించారు.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL




## పాక్‌లో భారీ పేలుడు.. 12 మంది మృతి

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారీ పేలుడు సంభవించింది. ఇవాళ (నవంబర్ 11, మంగళవారం) జ్యుడీషియల్ కాంప్లెక్స్ సమీపంలో జరిగిన పేలుడులో 12 మంది ప్రాణాలు కోల్పోగా, 20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో అత్యధికులు న్యాయవాదులేనని పాక్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఆత్మాహుతి దాడిగా అధికారులు భావిస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం సమయంలో కోర్టు గేటు వద్ద పార్క్ చేసి ఉన్న ఓ కారులో ఈ పేలుడు జరిగింది. అత్యంత రద్దీగా ఉండే సమయం కావడంతో ప్రాణనష్టం భారీగా జరిగింది. పేలుడు తీవ్రతకు సమీపంలోని పార్క్ చేసిన పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. సుమారు 6 కిలో మీటర్ల దూరం వరకు పేలుడు శబ్దం వినిపించినట్లు స్థానికులు పేర్కొన్నారు. పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నక్వీ మాట్లాడుతూ.. ఈ బాంబు దాడి మధ్యాహ్నం 12.39 గంటలకు జరిగిందని తెలిపారు. కారులోని గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందా? ఆత్మాహుతి దాడా? పలు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తాను నా కారు పార్క్ చేసి కాంప్లెక్స్‌లోకి వెళ్తుండగా.. గేటు సమీపంలో పెద్ద శబ్దం వినిపించిందని.. అక్కడ రెండు మృతదేహాలు పడి ఉన్నాయని న్యాయవాది రుస్తుమ్ మాలిక్ ఏఎఫ్‌పీ మీడియా తెలిపారు. కాగా, ఈ పేలుడు సంభవించిన కొన్ని గంటల ముందే దక్షిణ వజీరిస్థాన్‌లో పాక్ భద్రతా దళాలు ఓ ఉగ్ర కుట్రను భగ్నం చేసిన సంగతి తెలిసిందే. వానాలోని కేడెట్ కాలేజీపై తెహ్రీక్‌ఏతాలిబన్ పాకిస్తాన్ (TTP) ఉగ్రవాదులు దాడికి యత్నించగా.. అడ్డుకున్న భద్రతా దళాలు ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చాయి. ఇటీవల పాకిస్తాన్-ఆఫ్ఘనిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. అక్టోబర్ 9న కాబూల్‌లో జరిగిన డ్రోన్ దాడులకు ఇస్లామాబాద్ బాధ్యత వహించిందని ఆఫ్ఘనిస్తాన్ ఆరోపించింది. ఆ దాడిలో పలువురు మరణించగా, ప్రతీకార చర్యలు చేపడతామని కాబూల్ హెచ్చరించింది. అనంతరం జరిగిన సరిహద్దు ఘర్షణల్లో పలు సంఖ్యల్లో సైనికులు, పౌరులు, మిలిటెంట్లు మరణించారు. అక్టోబర్ 19న ఖతార్ మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే.



## 4 నెలల క్రితం ఊస్టింగ్.. మళ్లీ పోస్టింగ్?!



కంపెనీల్లో ఉద్యోగాల నియామకాల్లో హెచ్‌ఆర్ విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ఇంత ముఖ్యమైన హెచ్‌ఆర్ పనివిధానంపై చాలా విమర్శలు కూడా చాలా కామన్. తాజాగా అలాంటి సోషల్ మీడియా పోస్ట్ ఒకటి చర్చనీయాంశమైంది. 14 ఏళ్ళ సర్వీసు తర్వాత కాస్ట్ కటింగ్‌లో భాగంగా తొలగించిన ఉద్యోగికి రిక్రూటర్ తిరిగి జాబ్ ఆఫర్ చేసిన ఘటన నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. ఖర్చులను తగ్గించుకునే పనిలో భాగంగా కంపెనీ ఒక వ్యక్తిని ఉద్యోగంలోంచి తీసేసింది. సరిగ్గా నాలుగు నెలల తర్వాత తిరిగి అదే ఉద్యోగం కోసం ఒక రిక్రూటర్ తనను నియమించుకోవడానికి ప్రయత్నించాడని ఆయన వెల్లడించాడు."ఒక రిక్రూటర్ నన్ను భర్తీ చేయడానికి ప్రయత్నించాడు" అనే శీర్షికతో ఒక రెడ్డిట్ పోస్ట్ వైరల్ అవుతోంది. 14 ఏళ్ల పాటు కంపెనీకి సేవలందించిన తనను ఈ ఏడాది ఏప్రిల్‌లో తొలగించారని వెల్లడించాడు. తక్కువ వేతనంతో ఆ స్థానాన్ని భర్తీ చేయలేకపోయారు. నాలుగు నెలలు పాటు వెదికి, చివరికి లింక్డ్ఇన్ ద్వారా తిరిగి రిక్రూటర్లలో ఒకరు తనను సంప్రదించారని తెలిపాడు. అలాగే మొత్తానికి తన లింక్డ్ఇన్ ప్రొఫైల్ చెక్ చేసి, తాను అప్పటికే ఆ కంపెనీలో పనిచేసిన విషయాన్ని గుర్తించాడు అని కూడా పేర్కొన్నాడు.

### నెటిజన్ల స్పందన

**అతని ఆఫర్‌ను అంగీకరించాలని మెజారిటీ సోషల్ మీడియా వినియోగదారులు కోరగా, తమకు ఇలానే జరిగింది అంటూ తమ అనుభవాలను పంచుకున్నారు. రిక్రూటర్లు అంతే.. అన్నారు ఇంకొంతమంది.అలాగే ఆఫర్‌ను ఓకేచేసి, ఇంటర్వ్యూకి వెళ్లాలి, అపుడు వాళ్ల ఎక్స్‌పెషన్స్ చూడాలి మజా వస్తుంది అని ఒకరు వ్యాఖ్యానించడం విశేషం.**



## మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై కేంద్రానికి సుప్రీం నోటీస్

**న్యూఢిల్లీ:** లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు మూడింట ఒక వంతు సీట్లను కేటాయిస్తూ తీసుకువచ్చిన నారీ శక్తి వందన్ చట్టం-2023 అమలుపై స్పందన తెలియజేయాలని సోమవారం సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీస్ జారీ చేసింది. నియోజక వర్గాల పునర్ వ్యవస్థీకరణతో సంబంధం లేకుండా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు స్పందించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా మహిళలకు పార్లమెంట్‌తోపాటు రాష్ట్రాల శాసనసభల్లో తగు ప్రాతినిధ్యం లేదని పిటిషనర్ జయా ఠాకూర్ పేర్కొన్నారు. ప్రస్తుత జనాభా గణాంకాల ఆధారంగా 33 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. ఇప్పటికే చాలా ఆలస్యమైందన్నారు. తాజాగా నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ చేపట్టాక అమలు చేస్తామనడం సరికాదన్నారు. పార్లమెంట్ ఈ మేరకు అవసరమైన చట్ట సవరణ చేయాలని కోరారు. స్పందించిన ధర్మాసనం మన దేశంలో అతిపెద్ద మైనారిటీ వర్గం మహిళలేనని వ్యాఖ్యానించింది. జనాభాలో 48 శాతం వరకు ఉన్న మహిళలకు రాజకీయ సమానత్వాన్ని కల్పించడానికి ఉద్దేశించిన అత్యంత ముఖ్యమైన అంశమని పేర్కొంది. 'చట్టాన్ని అమలు చేసే అధికారం కార్యనిర్వాహక వర్గానికి మాత్రమే ఉంది. ఇలాంటి అంశాలపై ప్రభుత్వానికి మాండమస్ రూపంలో ఆదేశాలను జారీ చేయలేం' అని స్పష్టం చేసింది. అయితే, దీనిపై కేంద్ర ప్రభుత్వ అభిప్రాయం కోరుతామని తెలిపింది.

## ఆపరేషన్ క్లీన్.. 260 మంది ఆఫ్రికన్‌ల అరెస్ట్



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో డ్రగ్స్ దందా, విదేశీయుల అక్రమ వలసలపై పోలీసు బలగాలు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి ఆఫ్రికా దేశాలకు చెందిన 260 మందిని అదుపులోకి తీసుకున్నాయి. ఆదివారం ద్వారక, బిందాపూర్, డబ్రి, ఉత్తమ్ నగర్, మోహన్ గార్డెన్, తిలక్ నగర్, నిహాల్ విహార్‌లను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో చేపట్టిన 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'సందర్భంగా ఎలాంటి పత్రాలు లేని, గడువు దాటిన విదేశీయులను ప్రధానంగా లక్ష్యంగా చేసుకున్నట్లు జాయింట్ పోలీస్ కమిషనర్ (పశ్చిమ రేంజ్) జతిన్ నర్వాల్ చెప్పారు. ఒక్క ద్వారకలోనే మహిళలు, చిన్నారులు సహా 20 మంది పట్టుబడ్డారన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేని, వీరివద్ద డ్రగ్స్ కూడా దొరికాయన్నారు. ఎక్కువగా నైజీరియన్లే ఉన్నారన్నారు. వీరితోపాటు ఐవరీ కోస్ట్, సెనెగల్, సియెర్రా లియోన్, కామెరూన్, ఉగాండా, కెన్యా, జింబాబ్వే, ఘనా దేశాలకు చెందిన వారు కూడా పట్టుబడ్డట్లు చెప్పా రు. చట్టపరమైన ఎలాంటి నిబంధనలను పాటించకుండా విదేశీయులకు ఇళ్లను అద్దెకు ఇచ్చిన యజమానులను సైతం నిర్బంధంలోకి తీసుకున్నట్లు చెప్పారు.

## రాష్ డ్రైవింగ్, దాడులు, దోపిడీలు: 80 వేల వీసాలు రద్దు

**న్యూఢిల్లీ:** రెండోసారి అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టినప్పటి నుంచి తన దేశంలోని విదేశీయులను తరిమేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారు డొనాల్డ్ ట్రంప్. చిన్న చిన్న తప్పులకు కూడా వీసాలు రద్దుచేసి బలవంతంగా వారి స్వదేశాలకు పంపేస్తున్నారు. ఇలా ఈ ఏడాది జనవరి నుంచి 80 వేల వీసాలు రద్దుచేసినట్టు ట్రంప్ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉటంకిస్తూ వాషింగ్టన్ ఎగ్జామినర్ సంస్థ పేర్కొంది. మద్యం సేవించి వాహనాలు నడపటం, ఇతరులను ఇబ్బంది పెట్టడం, దొంగతనాల వంటి నేరాలు చేసిన వారి వీసాలను రద్దుచేసి వారిని స్వదేశాలకు పంపినట్టు తెలిపింది. రద్దుచేసిన ఈ 80 వేల వీసాలు నాన్ ఇమిగ్రేషన్ విభాగానివేనని వెల్లడించింది. ఇందులో 8 వేల వరకు విద్యార్థి వీసాలున్నాయి. అమెరికా చట్టాలను ఏమాత్రం ఉల్లంఘించినా వీసా రద్దు తప్పదని అధికారులు హెచ్చరించినట్టు వాషింగ్టన్ ఎగ్జామినర్ పేర్కొంది. 'అమెరికా చట్టాలను ఉల్లంఘించినా, మన దేశ భద్రతకు ముప్పు కలిగించే పనులు చేసినా.. వారి వీసాలు రద్దుచేసేందుకు ట్రంప్ ప్రభుత్వం ఏమాత్రం సంకోచించదు. మా సందేశం సుస్పష్టం. అమెరికాలోకి ప్రవేశించటం హక్కు కాదు. మేం ఎల్లప్పుడూ అమెరికా ప్రజల భద్రత, ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఇస్తాం' అని ఇమిగ్రేషన్ విభాగం ప్రిన్సిపల్ డిప్యూటీ ప్రతినిధి టామీ పిగోట్ తేల్చి చెప్పారు.



వీసాల జారీ కఠినతరం

ఇప్పటికే జారీచేసిన వీసాలను వివిధ కారణాలు చూపి రద్దుచేయటంతోపాటు కొత్తగా వీసాల జారీలోనూ అమెరికా కఠిన విధానాలు అమలుచేస్తోందని రాయిటర్స్ పేర్కొంది. వీసా జారీ కోసం దరఖాస్తుదారుడి సోషల్‌మీడియా యాక్టివిటీని పూర్తిగా అధ్యయనం చేస్తున్నారని తెలిపింది. ఈ ఏడాది రద్దు చేసిన వీసాల్లో డ్రైవింగ్‌లో నిబంధనల ఉల్లంఘనకు సంబంధించినవి 16,000 ఉన్నాయి. దాడులకు పాల్పడినవారికి 12,000, దోపిడీలు చేసినవారికి 8,000 ఉన్నాయి. గడువు దాటిన తర్వాత కూడా దేశంలో ఉన్నవాళ్లు, చట్టాలను ఉల్లంఘించినవాళ్లతోపాటు ఉగ్రవాదానికి మద్దతిచ్చి దాదాపు 6,000 మంది విద్యార్థుల వీసాలు రద్దుచేసినట్టు గత ఆగస్టులు అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి ఒకరు ప్రకటించారు. కరుడుగట్టిన అమెరికా జాతీయవాది, ట్రంప్ మద్దతుదారుడు చార్లీ కిర్క్ హత్యను సమర్థిస్తూ సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన ఆరుగురి వీసాలు గత నెలలో రద్దుచేసినట్టు ఓ అధికారి వెల్లడించారు. అమెరికా విదేశాంగ విధానాన్ని వ్యతిరేకించి వేలమంది వీసాలను రద్దుచేసినట్టు గత మేలో అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో స్వయంగా ప్రకటించారు. గాజాపై ఇజ్రాయెల్ దాడిని నిరసిస్తూ కొన్నాళ్లుగా అమెరికాలోని చాలా ప్రాంతాల్లో ఆందోళన జరిగాయి. దీంతో ట్రంప్ యంత్రాంగం ఆ నిరసనల పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది. పాలస్తీనాకు మద్దతుగా, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పనిచేసినా, మాట్లాడినా వీసాలు రద్దుచేయాలని విదేశాంగ శాఖ నుంచి ఇమిగ్రేషన్ విభాగానికి ఆదేశాలు వెళ్లాయని రాయిటర్స్ పేర్కొంది. వీసా దరఖాస్తు దారుల్లో పాలస్తీనా మద్దతుదారులుంటే వారి దరఖాస్తులు తిరస్కరిస్తున్నారు.